
# అయ్యిందా...? లేదా..?

ముచ్చర్ల రజనీ శకుంతల



సిటీలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్ అది.

కేవలం హైక్లాస్ వాళ్ళు తప్ప కనీసం మధ్య తరగతి వాళ్ళు కూడా అడుగుపెట్టడానికి జంకుతారు.

అలా మెయిన్‌టెన్ చేస్తారా హోటల్.

అలాంటి హోటల్ ముందు ఓ కాంటెస్సా వచ్చి ఆగింది. అందులో నుండి హుందాగా దిగాడు గీతార్థ్.

హుందాగా లోపలికి నడుస్తూ రిసెప్షన్ వైపు వెళ్ళాడు. రిసెప్షనిస్ట్‌తో లవ్లీగా మాట్లాడుతూ రూమ్ కీస్ అందుకొన్నాడు. ఫైవ్ స్టార్ హోటల్‌లో సూట్ అది.

రూమ్ ఓపెన్ చేసి రిలాక్సింగ్‌గా బెడ్‌మీద వాలిపోయాడు. పరవశంగా కళ్ళు మూసుకుని తను చేయబోయే పని గురించి ఆలోచించసాగాడు.

ఎంతో ఎగ్జయిటింగ్‌గా ఉండటానికి.

తన జీవితకాలంలో ఈ క్షణాలు ఓ మధురానుభూతిని మిగులుస్తాయి. తన కోరిక తీరబోతోంది. తొలి అనుభవం. అందుకే ఈ ఆత్రుత, కొత్తదనం.

ఈలోగా బేరర్ ఆర్డర్ చేసినవి తీసుకువచ్చి టీపాయ్ మీద ఉంచాడు. వేడి వేడి చిల్లీ చికెన్, కాజు, మసాలా పాపడ్, బాగ్‌పైపర్ విస్కీ బాటిల్స్ రెండు తెచ్చి సర్దిపెట్టి వెళ్లిపోయాడు.

గీతార్థ్ లేచి ఒళ్లు విరుచుకున్నాడు.

ఎంతో టెంప్టింగ్‌గా ఉన్నాయి టేబుల్‌మీద అరేంజ్ చేసినవి.

స్థిర నిశ్చయంతో లేచాడు ఇక ఒక్కటే తక్కువ అనుకుంటూ.

* * *

రెండు గంటల తర్వాత!

రూమ్‌లో ఫోన్ మోగసాగింది.

గీతార్థ్ వెళ్లి లిఫ్ట్ చేశాడు. "హలో!" అన్నాడు మత్తుగా.

"గురూ! మేమే. సక్సెసా? ఎంత వరకూ వచ్చింది?" ఆత్రుతగా అడిగాడు అవతల నుండి కపర్థి.

"ఆ! అయినా అప్పుడేనా? ఏవిట్రా ఆ కంగారు మీరూనూ, కొత్త కదా! మీలాగా అనుభవం ఉంటే నా పని తొందరగా అయ్యేది."

"సరే, సరే, త్వరగా కానీ. ఇక్కడ నువ్వు చెప్పే గుడ్‌న్యూస్ కోసం ఎదురుచూస్తున్నాం. ఓకేనా?"

"ఓ.కే...కొంత సేపయ్యాక ఫోన్ చెయ్యండి..." అంటూ ఫోన్ పెట్టేశాడు.

* * *

ఆ తర్వాత మరికొంత సేపటికే అలసిపోయి మత్తుగా వాలిపోయాడు బెడ్‌మీద.

ఈసారి ఫోన్ మ్రోగి మ్రోగి ఆగిపోయింది.

"పాపం! గురుడు అలసిపోయినట్టున్నాడు. పూర్తిగా సక్సెస్ అయినట్లే ఉంది. లేకపోతే అంత అలసిపోడు" అనుకున్నారు గీతార్థ్ ఫ్రెండ్స్ కపర్థి, కిరణ్, త్యాగి అందరూ.

"సర్లే తెల్లవారగానే ఫోన్ చేద్దాం" అన్నాడు ప్రీతమ్.

* * *

తెల్లవారి తొమ్మిదవుతోంది.

అప్పుడు మెలకువ వచ్చింది గీతార్థ్‌కి.

ఉలిక్కిపడి లేచాడు.

కాలింగ్‌బెల్ మోగితే వెళ్లి తలుపు తెరిచాడు.

బిల బిల మంటూ ఫ్రెండ్స్ అందరూ వచ్చేశారు.

"గుడ్ మార్నింగ్ డియర్! రాత్రి విశేషాలు చెప్పరా?"

అంటూ కుదిపేశారు గీతార్థ్‌ని.

"ఎలా జరిగిందిరా రాత్రి. ఎంతసేపు పట్టింది నీ పనయ్యేసరికి, ఎలా ఉందిరా నీ ఈ ఎక్స్‌పీరియన్స్,



## బరువు తగ్గిన రాణీముఖర్జీ

'హద్ కర్ దీ అప్నే' సెట్స్‌లో రాణీ ముఖర్జీ చాలా స్లిమ్‌గా కనిపించింది. అంత హఠాత్తుగా ఎలా తగ్గారు అని అడిగితే, సిగ్గుపడిపోయింది కానీ అసలు రహస్యం మాత్రం చెప్పనేలేదు. తమాషా ఏమిటంటే బుగ్గల్లోనే అందమంతా దాచుకొన్న ప్రీతి బుగ్గలు మాత్రం ఆపిల్స్‌లా అలాగే ఉండగా, రాణీ ఇంత బరువు ఎట్లు తగ్గిందా అని సెట్స్‌లో గుస గుస లాడుకొంటున్నారు!

మళ్లీ ఇలాంటి ప్రోగ్రాం ఎప్పుడు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించేశారు.

"హుఁ!" అంటూ కూలబడ్డాడు గీతార్థ్.

"అంటే"

"అట్టర్ ఫ్లావురా" అన్నాడు నీరసంగా.

"అయితే పనేం జరగలేదా?" కోపంగా అన్నాడు త్యాగి.

"లేదురా! మళ్లీ ట్రై చెయ్యాలి"

"ఛ...అదేవిట్రా! ఇన్‌సల్ట్ కాదూ!"

"చూద్దాం లేరా! మళ్లీ ఈ రోజు ట్రై చెయ్యనా?" గీతార్థ్ ఉత్సాహంగా అన్నాడు.

"ఛట్! ఇప్పటికే బిల్లు పదివేలయి ఉంటుంది. ఇక మళ్లీ ఇంకో రోజా!"

ఇంతలో రూమ్‌బోయ్ క్లీన్ చెయ్యడానికి వచ్చాడు అతని డ్యూటీ ప్రకారం.

"మరి ఏం చేద్దాంరా ఇప్పుడు? ఈరోజు వేరే హోటల్ బుక్ చేసి, వేరే లేబుల్ బాటిల్ డ్రింక్ చేస్తే మూడ్ సరిగా వస్తుందేమో!" అనుమానంగా అన్నాడు గీతార్థ్.

"ఒరే అప్పుడు కూడా పనికాక, ఫెయిలయ్యావంటే ఇన్‌సల్ట్‌రా! డ్యామ్ ఇన్‌సల్ట్‌రా!" అన్నాడు కపర్థి.

బేరర్ వాళ్ల మాటలు వింటూనే ఉన్నాడు. విన్నవాడు ఉండబట్టలేక "సార్! మీరు 'ఊ' అనండి ఈ రాత్రికి నేను 'కనక్కా' లాంటి పిల్లను బుక్ చేసుకొస్తాను. అప్పుడు సార్ వారు ఫెయిలయ్యేదే ఉండదు" అన్నాడు మహా సంతోష పడిపోతూ!

ఈసారి గీతార్థ్‌తో సహా అందరూ తెల్ల ముఖాలు వేశారు.

"అం...టే..." అన్నాడు గీతార్థ్ తేరుకుని.

"అదేనండీ! మంచి ఫ్యామిలిటైప్ అమ్మాయిని తెస్తా!"

"దేనికి"

"పని కాలేదన్నారు కదండీ" ఈసారి బేరర్ తెల్లముఖంతో అన్నాడు.

"ఒరే! ఇడియట్! మేం అమ్మాయితో కులకడానికి కాదురా రూమ్ బుక్ చేసుకుంది."

"మరి ఇందాకణ్నుంచి మీరు"

"అదా! మా గురువు కథ వ్రాయటం కోసం ఈ రూమ్ బుక్ చేసుకుని ఇంత హంగామా చేశాడు."

"అయితే పనయ్యిందా? లేదా? అంటే కథ రాయటమా?"

"అవును మహానుభావా?"

"అయినా సారూ! కథలురాయాలంటే ఇలాటి హోటల్‌లో రూమ్ బుక్ చెయ్యాలని ఎవరన్నారండీ?"

"పెద్ద పెద్ద రైటర్సూ, డైరెక్టర్స్ ఇలాంటి రూమ్ బుక్ చేసుకునే రాస్తారట కదా! పైగా డ్రింక్ చేస్తూ, ఇలాంటి రూమ్ వాతావరణం ఉంటే దడదడా కథలురాసేయొచ్చట కదా!" అన్నాడు త్యాగి.

"భలేవారు సార్! ఇలా రండి మీకు ఓటి చూపిస్తాను" అంటూ రూమ్‌కి ఉన్న పరదాని తొలగించాడు బేరర్.

"కిందకి చూడండి సార్!" అన్నాడు అందరితో

అందరూ కుతూహలంగా కిందకి చూడసాగారు.

హోటల్ పక్కనే ఉన్న స్లమ్ ఏరియా అది. అక్కడ పూరి గుడిసెలు, అసలు గుడిసెలే లేని అనాథలు, బిచ్చగత్తెలు, కుష్టు వ్యాధి సోకిన వాళ్లు, గుడ్డి, కుంటి వాళ్లు ఉన్నారు.

"రొక్కాడినా డొక్కలు నిండని బతుకులు బాబు వాళ్లవి. మీరా కథ వ్రాయాలంటే అక్కడ ఒకో మనిషికి ఒకో కథుంటుంది బాబూ. వారి కథ వ్రాయండి. సామాజిక స్పృహ ఉన్న రచయితగా మీకు పేరొస్తుంది. అంతేగానీ ఇలాటి ఏ.సి.గదుల్లో కూచ్చొని రాయాలంటే ఏం దొరుకుతుంది బాబూ!" అన్నాడు జాలిగా అందరి వంకా చూస్తూ.

"అవును. బేరర్ చెప్పిన ఈ పాయింట్‌నే నేను కథగా రాస్తాను. ఎందుకు పబ్లిష్ కాదో చూస్తాను" అన్నాడు గీతార్థ్ స్థిర నిశ్చయంతో. అవును. ఎందుకు కాదు. మంచి కథలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది.